# బ్రహ్మసూత్రములు- 2

# - వేదవ్యాస మహర్షి

# (బాదరాయణులు)





Sample : WWW.SRICHALAPATHIRAO.COM

**: వ్యాఖ్యాత :**

**“అభినవ వ్యాస“,“జ్ఞానప్రపూర్ణ“**

**శ్రీ దేవిశెట్టి చలపతిరావు** *B.Sc(Ag)*

వ్యవస్థాపకులు

ఆధ్యాత్మిక జ్ఞాన పీఠం : చిలకలూరిపేట.

**Website : WWW.SRICHALAPATHIRAO.COM**

**Email : care@srichalapathirao.com**

*Contact : +91 88855 39770 / +91 98862 65225*

# బ్రహ్మసూత్రములు- 2

## విషయ సూచిక

WWW.SRICHALAPATHIRAO.COM


**తృతీయాధ్యాయం - తృతీయపాదం:...........................03**

**తృతీయాధ్యాయం - చతుర్ధపాదం:............................36**

**చతుర్ధాధ్యాయం........................................................99**

**చతుర్ధాధ్యాయం : ప్రధమ పాదం: .........................104**

**చతుర్ధాధ్యాయం : ద్వితీయ పాదం : .....................160**

**చతుర్ధాధ్యాయం : తృతీయపాదం:............................207**

**చతుర్ధాధ్యాయం : చతుర్ధపాదం:.............................242**

# బ్రహ్మ సూత్రములు

ఓం సదాశివ సమా రంభాం

శంకరాచార్య మధ్యమాం

అస్మదాచార్య పర్యంతాం

వందే గురు పరంపరాం ||

వందే గురు పరంపరాం ||

# 3 వ అధ్యాయం - 3 వ పాదం

Sample : WWW.SRICHALAPATHIRAO.COM

ఉపోద్ఘాతం:- ఇంతవరకు రెండవ పాదంలో తత్త్వమసి మహావాక్యంలోని తత్, త్వం పదాల గురించి తెలియజేసి, ఆ తత్, త్వం ల ఏకత్వాన్ని గురించి చెప్పారు. ఇప్పుడు ఈ మూడవ పాదంలో అనేక ఉపనిషత్తులలో చెప్పబడిన ఉపాసనల గురించి చెప్పబోతున్నారు. అయితే ఈ ఉపాసనలు ప్రధానంగా తైత్తిరీయక, వాజసనేయక, కౌధుమారి శాఖా భేదాలను బట్టి ఇవన్నీ వేరు వేరా? లేక ఒక్కటేనా? అనే సందేహాన్ని నివారించటానికి ఈ పాదం.

అనేక ఉపనిషత్తులలో వీటిని ఉపాసనలు అని చెబితే కొన్ని ఉపనిషత్తులలో వీటిని విద్యలు అన్నారు. ఇంతకూ విద్య, ఉపాసనా వేరు వేరా? ఒక్కటేనా? అంటే ఒక్కటే. విద్య అన్నా ఉపాసన అన్నా రెండూ ఒక్కటే. ఎందుకంటే ఉపనిషత్తులలో

చెప్పిన ఉపాసనలన్నీ విద్యలే. ఉపనిషత్తులలో విద్యలుగా చెప్పబడ్డవన్నీ ఉపాసనలే.

ఈ విద్యలు లేదా ఉపాసనలు, అవి ఇచ్చే ఫలితాలను బట్టి 2 విధాలుగా విభాగించవచ్చు.

1. ఇహలోక సౌఖ్యాన్ని ఇచ్చేవి. అంటే మనకు కనిపించే ఫలితాలను (దృష్ట ఫలితాలను) ఇచ్చేవి.

2. కొన్ని పరలోక సుఖాలనిచ్చేవి. అంటే మనకు కనిపించని ఫలితాలను అంటే అదృష్ట ఫలితాలను ఇచ్చేవి. వీటిలో కొన్ని స్వర్గ భోగాలను అందిస్తాయి. కానీ ఆ భోగానుభవం తర్వాత తిరిగి ఈ లోకంలో జన్మించి సుఖ దుఃఖాలు అనుభవించాలి. మరికొన్ని ఉపాసనలు క్రమముక్తి ద్వారా బ్రహ్మ లోకానికి చేరుస్తాయి. తిరిగి వచ్చే పని లేదు.

అన్ని ఉపనిషత్తులలోను ఏదో ఒక విద్య (ఉపాసన) లేదా కొన్ని విద్యలు చెప్పబడ్డాయి. ఈ విద్యలలో కొన్ని సగుణోపాసనను గురించి చెబితే కొన్ని నిర్గుణోపాసనను గురించి చెబుతున్నాయి. సాధకుడు ప్రారంభంలో సగుణోపాసనతో ప్రారంభించాలి. అలా సాధన చేస్తున్న కొద్దీ సాధకుడు ఆత్మజ్ఞానాన్ని పొందుతూ క్రమంగా నిర్గుణోపాసనలో నిలువ గలుగుతాడు.

సగుణబ్రహ్మోపాసనవల్ల చిత్త స్థైర్యం కలుగుతుంది. అది నిర్గుణబ్రహ్మోపాసనకు దారితీస్తుంది. దానితో మోక్షప్రాప్తి - స్వస్వరూపస్థితి - పునరావృత్తిరహితస్థితి సిద్ధిస్తుంది.

Sample : WWW.SRICHALAPATHIRAO.COM

మోక్ష ప్రాప్తికి ఆత్మజ్ఞానాన్ని పొందాలి. ఆత్మవిచారణ చేయాలి. అందుకు నిర్గుణోపాసన చక్కని సాధనం. అయితే నిర్గుణోపాసన ఎంతటి వారికైనా ప్రారంభంలో సాధ్యం కాదు. అందుకు తగిన మానసికస్థైర్యం ఉండదు. దానిని సాధించటానికి సగుణోపాసన ఉపయోగపడుతుంది. సగుణోపాసన ఎట్టి వారైనా చేయవచ్చు. కనుక చూడటానికి వేరు వేరు పేర్లతో, వేరు వేరుగా కనిపించినా సగుణ - నిర్గుణోపాసనల యొక్క అంతిమ లక్ష్యం ఒక్కటే. అదే మోక్షప్రాప్తి. ఈ ఉపాసనలు అనేక ఉపనిషత్తులలో చెప్పబడ్డాయి.

ఇలా ఉపనిషత్తులలో చెప్పబడ్డ విద్యలు (ఉపాసనలు) కొన్ని ఒకే విధంగా కనపడినా అవి వేరు వేరై ఉండవచ్చు. కొన్ని వేరువేరుగా కనిపించినా ఒక్కటే అయి ఉండవచ్చు. మరి ఉపనిషత్తులలో చెప్పబడ్డ ఎన్నో రకాల విద్యలను అనేక విద్యలుగా - భిన్న భిన్నములుగా గ్రహించాలా? ఆయా విద్యలలో గల పోలికలను, భేదాలను చూచి ఏ విద్యలను ఒక్కటిగా గ్రహించాలి? వేటిని వేరు వేరుగా గ్రహించాలి? అనే విషయాలను చర్చించి నిర్ణయించేదే ఈ తృతీయ పాదం.

ముందుగా క్రమముక్తి ఫలితాన్ని సాధించ గల విద్యలను గూర్చిన విచారణ - చర్చ జరుగుతున్నది.

ఇక ప్రథమ సూత్రం -

Sample .WWW.SRICHALAPATHIRAO.COM

అనేక ఉపనిషత్తులలో చెప్పబడ్డ అనేక విద్యలు (ఉపాసనలు) వేరు వేరా? లేక ఒక్కటేనా? అనే సందేహాన్ని నివారించటానికి ఈ మొదటి సూత్రం :- అన్నీ ఒక్కటే అని ఋజువు చేయటానికే

**సూత్రం (1): సర్వ వేదాంత ప్రత్యయం, చోదనాద్య విశేషాత్**

అన్ని వేదాంతములయందు విధించబడిన ఉపాసనలు భిన్నమైనవి కావు. ఎందుకంటే విధి యందు భేదము లేదు గనుక. అంటే ఉపాసన చేయవలసిన విధానంలోను వచ్చే ఫలితంలోను భేదం లేదు గనుక.

**సంశయం**

బ్రహ్మం ఏకం - అద్వితీయం. కనుక బ్రహ్మన్ని పొందే ఉపాసనలలో కూడా ఏకత్వం ఉండాలి. అనేక రకాలైన ఉపాసనలు ఉండకూడదు. - పూర్వపక్షి.

**సమాధానం**

అన్ని ఉపనిషత్తులలోను చెప్పబడిన ప్రాణ విద్య, పంచాగ్ని విద్య మొ//న ఉపాసనలన్నీ ఒక్కటే. వేరు వేరు కాదు.

ఎందుకంటే ఆ ఉపనిషత్తుల విధివిధానాలు గాని, వాటివల్ల లభించే ఫలం గాని, ఉపాస్య స్వరూపం గాని, పేరు గాని ఒకే విధంగా ఉన్నాయి గనుక. ఉదాహరణకు నిత్యాగ్ని హోత్రాన్ని చూడండి - విధాయక వాక్యం - అంటే చేసే విధానం

Sample : WWW.SRICHALAPATHIRAO.COM

అన్నింటిలోనూ ఒకే విధంగా ఉన్నది. కనుక అన్ని శాఖల వారికి నిత్యాగ్ని హోత్రం సమానమే.

అలాగే ప్రాణవిద్యకు సంబంధించి ఛాందోగ్య, వాజసనేయ శాఖలలో ఉపాసనా విధానం ఒకే విధంగా ఉన్నది.

"యోహవై జ్యేష్ఠంచ శ్రేష్టంచ వేద"

*(బృహ 6-1-1) (ఛాం 5-1-1)* - ఎవడు ప్రాణాన్ని జ్యేష్ఠమైనదిగా, శ్రేష్ఠమైనదిగా తెలుసుకుంటాడో -

"జ్యేష్ఠశ్చ శ్రేష్ఠశ్చ స్వానాం భవతి"

*(బృ 6-1-1)* - అట్టివాడు తన వారిలో జ్యేష్ఠుడు, శ్రేష్ఠుడు అవుతాడు - అంటూ ఫలితాన్ని కూడా ఒకే విధంగా చెప్పాయి. కనుక ప్రాణవిద్య అన్ని శాఖల వారికి సమానమే. ఇలాగే పంచాగ్ని విద్య, శాండిల్య విద్య, వైశ్వానర విద్య మొ//న వాటిని కూడా ఒక్కటిగానే గ్రహించాలి.

సూత్రం -2 : భేదం లేదు గనుక అన్నీ ఒక్కటే అని ఋజువు చేయటానికి.

<u>సూత్రం(2) భేదాన్నేతి చేన్నైక స్యామపి.</u>

భేదాత్ న ఇతి చేత్ న ఏకస్యాం అపి.

- భేదం ఉన్నది అనటం సరికాదు. ఒక్కటే గనుక.

<u>సందేహం</u>

ఉపాసనా విద్యలలో ద్రవ్యభేదం, దేవతా భేదం వల్ల భేదం లేదు అనటం ఎలా కుదురుతుంది? పంచాగ్ని విద్య

Sample : WWW.SRICHALAPATHIRAO.COM

యందు బృహదారణ్యకంలో ఆరు అగ్నులను చెప్పారు. చాందోగ్యంలో *5* అగ్నులను చెప్పారు. అలాగే ప్రాణోపాసన (ప్రాణ విద్య) యందు ముఖ్య ప్రాణం కాక నాలుగు ప్రాణాలని చాందోగ్య శాఖ వారు చెప్పగా, బృహదారణ్యకంలో వాజసనేయ శాఖవారు ఐదు అని చెప్పారు. అందువల్ల ఉపాస్యానికి రూపభేదం, విద్యయందు అనేకత్వం వస్తున్నది గదా!

సమాధానం

స్వల్పమైన రూపభేదం, గుణభేదం ఉంటే ఉండవచ్చు.

ఈ భేదాలన్నీ గౌణం = ముఖ్యమైనవి కావు. భేదం చాలా అల్పంగా ఉండి సామ్యం(ఏకత్వం) అధికంగా ఉన్నప్పుడు అనేకత్వం ఉన్నది అనటం సరికాదు. కనుక ఏకత్వమే ఉన్నది.

*సూత్రం 3 నుండి 25 వరకు గల విద్యలు(ఉపాసనలు)-*

*(1)* ప్రాణవిద్య : ఛాందోగ్య బృహదారణ్యకాలలో ఈ ప్రాణవిద్య చెప్పబడింది. *- ఏమిటీ ప్రాణ విద్య? ప్రాణోపాసన? -*

శరీరంలోని ఇంద్రియాల మధ్య నేను గొప్ప అంటే నేను గొప్ప అనే వివాదం తలఎత్తింది. వాక్కు, నేత్రం, చెవి, మనసు, ప్రాణం - ఇలా అన్ని ఇంద్రియాలు తగవులాడుకున్నాయి.

ఈ తగవును తేల్చటానికి అన్నీ కలసి బ్రహ్మ దేవుని వద్దకు వెళ్ళి వివాదాన్ని చెప్పాయి - అప్పుడు బ్రహ్మ అన్నాడు. "మీలో ఒక్కొక్కరు దేహాన్ని విడిచి వెళ్ళండి. మీలో ఎవరు బయటకు వెళ్ళినప్పుడు దేహం తేజస్సును కోల్పోయి, శక్తి లేనిదై

Sample : WWW.SRICHALAPATHIRAO.COM

పోతుందో వారే శ్రేష్ఠులు - గొప్పవారు అని తెలుస్తుంది". అన్నాడు.

సరేనని తిరిగి వచ్చి, ముందుగా వాక్కు బయటకు వెళ్ళిపోయింది. నేను లేని దేహము శక్తిహీనం, తేజోహీనం అయి ఉంటుంది అనుకుంటూ సం||రం తర్వాత తిరిగి వచ్చి చూచింది. తాను దేహాన్ని విడిచి వెళ్ళిపోయినా దేహం యొక్క శక్తి తగ్గలేదు. తేజస్సు తగ్గలేదు. జీవనక్రియలు ఆగలేదు. అయినా అడిగి చూద్దాం అని వాక్కు అడిగింది. ఓ దేహేంద్రియ ప్రాణములారా? నేను లేకపోతే జీవనక్రియలు ఎలా సాగిపోయినవి? దేహం ఎలా ఉన్నది? అని అడిగింది. దానికి ఇతర ఇంద్రియాలు చెప్పినవి. "మూగవాడికి వాక్కు లేకపోయినా అన్ని జీవనక్రియలు ఎలా సాగిపోతుంటాయో అలాగే నీవు లేకపోయినా అన్నీ జరిగిపోయాయి. దేహం శక్తిహీనం కాలేదు - అని. వాక్కు తన ఓటమిని అంగీకరించి దేహంలో చేరిపోయింది.

అప్పుడు కన్ను - "నేను లేకపోతే జీవన క్రియలు ఎలా జరుగుతాయో చూస్తానని" శరీరం నుండి వెళ్ళిపోయింది. *1* సం||రం తర్వాత తిరిగి వచ్చింది. దేహం శక్తిహీనం కాలేదు. జీవన క్రియలన్నీ జరిగిపోయాయి. మిగిలిన ఇంద్రియాలు "పుట్టు గ్రుడ్డివాడు ఎలా జీవనక్రియలు జరుపుకుంటాడో అలాగే అన్నీ జరిగిపోయినవి అన్నవి. దానితో కన్ను పరాజయాన్ని

Sample : WWW.SRICHALAPATHIRAO.COM

అంగీకరించి దేహంలో చేరిపోయింది. ఆ తరువాత చెవి, ముక్కు, మనస్సు కూడా అలాగే ఓటమిని అంగీకరించినవి.

ఇప్పుడు ప్రాణం శరీరం నుండి బయటకు వెళ్ళిపోయింది. ప్రాణం బయటకు పోవటంతోనే శరీరం శక్తి హీనమై ఇంద్రియాలు పనిచేయలేక పోయినవి. వాక్కు మూగపోయింది. చెవి వినలేక పోయింది. ముక్కు వాసన పీల్చలేకపోయింది. చర్మం స్పర్శజ్ఞానాన్ని కోల్పోయింది. కన్ను చూడలేకపోయింది. మళ్ళీ ప్రాణం దేహంలోకి చేరగానే అన్నీ వాటివాటి పనులలో నిమగ్నమైనవి.

అప్పుడు వాక్కు "ఓ ప్రాణమా! నీవే గొప్ప. మా అందరికన్నా శ్రేష్ఠురాలవు, నీవు ఉంటేనే మేము శక్తివంతులం. నీవు లేకపోతే మేము ఒక్క క్షణం కూడా నిలువలేము. కనుక నీవే శ్రేష్ఠుడవు. నీవే బ్రహ్మవు. మేము నిన్నే బ్రహ్మముగా ఉపాసిస్తాము" అన్నది. అన్నీ అంగీకరించినవి.

ప్రాణోవావ జ్యేష్ఠశ్చ శ్రేష్ఠశ్చ. *(5-1-1)* ఛాందోగ్య

కనుక ప్రాణమును బ్రహ్మముగా తెలుసుకొని ప్రాణోపాసన చెయ్యాలి. అట్టివారే ఈ లోకంలో సుఖాన్ని, పరలోకంలో కైవల్యాన్ని పొందగలరు. ఇదే ప్రాణవిద్య.

ఈ కథను తెలుపుతూ ఛాందోగ్యంలో ముఖ్య ప్రాణము వెంట *4* ప్రాణాలు వెళ్ళినవి అని, బృహదారణ్యంలో ముఖ్య ప్రాణముతో *5* ప్రాణాలు వెళ్ళినవని అన్నారు. అంతమాత్రాన ఈ

Sample : WWW.SRICHALAPATHIRAO.COM

**"బ్రహ్మసూత్రములు" గ్రంధంపై పూజ్య గురుదేవులు "శ్రీ దేవిశెట్టి చలపతిరావుగారు"' చేసిన వ్యాఖ్య *500* పేజీలకు పైగా ఉన్న పుస్తకము మా వద్ద లభిస్తుంది**

***Ebook* మీరు *DOWNLOAD* చేసుకొనుటకు రూ*.500/-* లేదా పుస్తకమును మేము మీ ఇంటికి పంపాలంటే రూ*.560/-* *(courier* ఖర్చులతో కలిపి*) ONLINE* లో చెల్లించుటకు *-***

***Click & Pay us through Paytm :*** Paytm

***http://srichalapathirao.com/images/paytm_QR_WWW SRICHALAPATHIRAOCOM.png***

**లేదా**

***Pay us through Net Banking :*** HDFC BANK

***http://srichalapathirao.com/PDFs/Bank.pdf***

**మీకు మరేదైనా సందేహం ఉంటే *care@srichalapathirao.com* కు ఈమెయిల్ పంపగలరు లేదా *+91 80085 39770 OR +91 95388 58115* నంబర్లకు ఫోన్ చేయగలరు**

Refer : ***http://www.srichalapathirao.com/catalog***